# సత్యవాక్యం

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

JULY - 2001

# సంక్షిప్త వార్తలు

గతసంచికలో ప్రచురించిన విధముగా జాషువా గూటం గారి రెండవ కుమారుడు సామ్యూల్ రోనీ గారు బి.టెక్ (కెమికల్) ప్రథమశ్రేణీలో ఉత్తీర్ణులయ్యారని తెలియజేయుటకు సంతోషించుచున్నాము. ఇప్పుడాయన యం.టెక్. చేయు సంకల్పములో యున్నారు.

2001 జూన్ 2వ తేదీ శనివారం నాడు తూ॥గో॥జిల్లా ప్రత్తిపాడు మండలం, టి.రాయవరంలో స్థానికులు నిర్మించుకొనిన క్రీస్తు సంఘ ఆలయమును సోదరులు జాషువాగారు ప్రార్ధన పూర్వకముగా తెరచిరి. ఆలయ ప్రతిష్ఠ జరిగిన తరువాత జరిగిన కూటములో వాక్యోపదేశము గావించిరి. ఈ కూటములో మాధాపురం నుండి యం.యేసుదాసు గారు, చదలాడ నుండి యం.ప్రేమ్ కుమార్ గారు వచ్చి పాటలు పాడుటలోను, ప్రార్ధన చేయుటలోను సహకరించిరి. టి.రాయవరంలో సోదరులు పాలేటి మోజెస్ గారు క్రీస్తు కొరకు శ్రమించు చున్నారు. ఆలయ నిర్మాణములో సహకరించిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపిరి.

జూన్ 5వ తేదీ మంగళవారం అమలాపురంలో సోదరలులు బొంతు ధనరాజు గారు నిర్మించుకొనిన నూతన గృహ ప్రవేశము జరిగినది. ఈ సందర్భముగా అమలాపుర పట్టణ ప్రముఖులు, రాజకీయనాయకులు, అధికారులు, బంధువులు, మిత్రులు, క్రైస్తవ సోదరసోదరీలు ఆయనను అభినందించిరి. నాడు జరిగిన కూటమునకు నెహమ్యా గూటం గారు అధ్యక్షత వహించగా, జాషువా గూటం గారు ముఖ్య ప్రసంగం చేసిరి. అటుతరువాత అనేకమంది శ్రేయోభిలాషులు ఆయనకు అభినందనలు తెలియజేసిరి. నాటి కూటము ధనరాజు గారి రెండవ కుమారుడు బొంతు జోసఫ్‌రాజు గారి ప్రార్ధనతో ఆరంభమై ధనరాజు గారి వందన సమర్పణతో ముగిసెను. మంచి గృహమునకు ప్లాన్‌వేసి చక్కటి రూపురేఖలు దానికి వర్తింపజేసిన ధనరాజు గారి అల్లుడు రత్నకుమార్ గారు అభినందనీయులు.

జూన్ 11వ తేదీ సోమవారం రాజమండ్రిలో గొప్ప సువార్తసేవ జరుపుచున్న సోదరులు వి.సుదర్శనరావ్ దంపతుల వైవాహిక జీవిత రజతోత్సవం (Silver Jubilee Celebration) ఘనముగా జరిగెను. రాజమండ్రి సారంగధర మెట్ట, జయానగర్‌లో యున్న క్రీస్తు సంఘ ఆవరణలో ఏర్పాటు చేయబడిన ఈ రజతోత్సవములో సుదర్శనరావ్, అన్నాఎలీజబెత్ గార్ల బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, సోదరసోదరీలు పాల్గొని ఆ దంపతులను అభినందించిరి. అట్లే సోదరులు టి.జ్ఞానానందం, టి.ప్రేమానందం (కాకినాడ), యల్.విఘ్నేశ్వరరావ్ (విశాఖ -దయాల్‌నగర్), పి.జాన్‌మోజెస్ (గొల్లపాలెం) ఎ.జ్ఞానరాజు, ఎ.బి.వి ప్రసాద్

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

**P.O. Box 80, Kakinada, A.P. 533 001**

**Phone : 0884 - 363722**

**Editor :**

**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 21 జూలై 2001 సంచిక 12


## దేవుడు సర్వాంతర్యామి, సర్వజ్ఞాని
## (God is Omnipresent and Omniscient)

గతపాఠంలో దేవుడు సర్వశక్తిమంతుడు అనే అంశాన్ని ధ్యానించాము. దేవుడు సర్వశక్తిమంతుడే కాదు; ఆయన సర్వాంతర్యామి, సర్వజ్ఞాని యని కూడా బైబిలు బోధించుచున్నది. ఆయన ఒక స్థలానికి సమయానికి పరిమితమైన వాడు కాదు. దేవుడు సర్వాంతర్యామి అనగా ఆయన ఈ విశ్వమంతటిలోను ఒకే సమయమందు వ్యాపించి యున్నవాడు. ఆయన ఈ విశ్వానికి అతీతుడు. ఆయన అన్నిచోట్ల ఒకే సమయమందుండు వాడు. ఆయన మనలో ఎవనికిని దూరముగా ఉండువాడు కాడు (అపొ.కా.17:27). ఆయన మనకెంత సమీపముగా నున్నాడో, అదే సమయములో పశ్చిమార్ధ గోళములో యున్నవారికి అంతే సమీపముగా నున్నాడు.

"నేను సమీపమున నుండు దేవుడను మాత్రమేనా ? దూరమున నుండు దేవుడనుకానా ? యెహోవా సెలవిచ్చిన మాట ఏదనగా - నాకు కనబడకుండ రహస్య స్థలములలో దాగగల వాడెవడైనను కలడా ? నేను భూమ్యాకాశముల యందంతట నున్నవాడను కానా ? యిదే యెహోవా వాక్కు" అని ఆయన యిర్మియా ప్రవక్త ద్వారా ప్రకటించెను (యిర్మియా 23:23-24). ఆయన పని చేయడానికి, లేక మన ప్రార్ధనలు వినడానికి ఒకచోట నుండి మరొక చోటికి వెళ్లనవుసరము లేదు. సర్వసృష్టియంతటను ఆయన ఆవరించియున్నాడు. ఈ లోకంలో నీవెక్కడ యున్నను ఆయనకు సమీపముగానే యుంటావు. అందువలన దేవుని సాన్నిధ్యము పొందాలంటే తీర్థయాత్రలు వగయిరా చేయనవుసరం లేదు. గాని వినయము, విధేయత మారుమనస్సు ఉంటే ఆయన సన్నిధికి చేరుకోగలవు.

## పరిమితి లేనివాడు

దేవుడు సర్వాంతర్యామి గనుక ఆయనను ఒక స్థలమునకు పరిమితము చేయులేము. కొందరు గుడులు, గోవురాలు కట్టి అందులో దేవుణ్ణి వుంచామనుకొంటారు. అది అసంభవము. సొలొమోను మహారాజు యెరూషలేములో దేవాలయమును నిర్మించినను, దేవుణ్ణి దాంట్లో బంధించగలనను కోలేదు. సరిగదా, ఆ ఆలయాన్ని ప్రతిష్ట చేస్తూ, "నిశ్చయముగా దేవుడు ఈ లోకమందు నివాసము చేయడు; ఆకాశ మహాకాశములు సయితము నిన్ను పట్టజాలవు; నేను కట్టించిన ఈ మందిరము ఏలాగు పట్టును?" అని ప్రార్ధించాడు (I రాజులు 8:27). దేవుడు ఆత్మ గనుక ఆయనను ఒక గుడికో లేక కొండకో పరిమితము చేయలేమని యేసు ప్రభువు కూడా బోధించారు. (యోహాను 8:24). ఆయున అన్నిచోట్ల ఒకే సమయమందున్నవాడు, సర్వాంతర్యామి ! !

దేవుడు, ఈ విశ్వాన్నంతటికి పైగా యున్నవాడు. ఆయన సర్వోత్కృష్టమైన వాడు మహానీయమైనవాడు. ఆయన సర్వాంతర్యామి. దేవుడు ఈ విశ్వానికి పైగా యున్నవాడైనను, ఈ విశ్వం అంతటిలోను అంతర్భూతమైనవాడు. (He is immanant).

ఎక్కడో దూరాన్న వుంటూ ఆయన ఈ విశ్వంలో అటు యిటు చలించడు. "అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే. ఆయన అందరికి పైగా ఉన్నవాడై అందరిలోను వ్యాపించి అందరిలో ఉన్నాడు" (ఎఫెసీ 4:6).

దేవుడు ఈ విశ్వం అంతటిలోను వ్యాపించి యున్నవాడైనను, అంత గంభీరుడైనను మనలో, మనతో నివసించగలడు. "మహా ఘనుడును, మహోన్నతుడును పరిశుద్ధుడును, నిత్యనివాసియునైనవాడు ఈలాగు సెలవిచ్చుచున్నాడు : నేను మహోన్నతమైన పరిశుద్ధ స్థలములలో నివసించువాడను. అయినను వినయము గలవారి ప్రాణమును ఉజ్జీవింపజేయుటకును, నలిగినవారి ప్రాణమును ఉజ్జీవింపచేయుటకును వినయము గలవారి యొద్దను, దీన మనస్సు గలవారి యొద్దను నివసించుచున్నాను" అని ఆయన యెషయా ద్వారా సెలవిచ్చారు. (యెషయా 57:15). అందుకే దైవజనుడైన మోషే యిట్లు ప్రార్థించాడు : "ప్రభువా, తర తరముల నుండి మాకు నివాస స్థలము నీవే; పర్వతములు పుట్టక మునుపు భూమిని లోకమును నీవు పుట్టింపక మునుపు యుగ యుగములు నీవే దేవుడవు" (కీర్తన 90:1-2). ఆయన నిత్యము వున్నవాడు, నిత్యము ఉండువాడు. కాలముతో నిమిత్తము లేనివాడు. ఆయన గతంలో యున్నవాడు, ప్రస్తుతము వున్నవాడు, భవిష్యత్తులో వుండువాడు. ఆయన ఉండు ననువాడైయున్న దేవుడు. యెహోవా దేవుడు (నిర్గమ 3:14).

## ఆయన నుండి పారిపోలేము

దేవుడు సర్వాంతర్యామియైన వాడు గనుక ఆయన నుండి పారిపోలేము, ఆయన నుండి దాగుకొనలేము. "నీ ఆత్మ యొద్ద నుండి నేనెక్కడికి పోవుదును? నీ సన్నిధినుండి నేనెక్కడికి పారిపోవుదును? నేను ఆకాశమున కెక్కినను నీవు అక్కడను ఉన్నావు. నేను పాతాళమందు పండుకొనినను నీవు అక్కడను ఉన్నావు. నేను వేకువ రెక్కలు కట్టుకొని సముద్ర దిగంతములలో నివసించినను అక్కడను నీ చేయి నన్ను నడిపించును, నీ కుడిచేయి నన్ను పట్టుకొనును. అంధకారము నన్ను మరుగు చేయును నాకు కలుగు వెలుగు రాత్రివలె ఉండును అని నేననుకొనిన యెడల చీకటియైనను

నీకు చీకటి కాకపోవును. రాత్రి పగటివలె నీకు వెలుగుగా ఉండును. చీకటియు వెలుగును నీకు ఏకరీతిగా ఉన్నవి" యని దావీదు చెప్పాడు (కీర్తన 139:7-12).

దేవుడు సర్వాంతర్యామి యైనప్పుడు సహజంగా ఆయన సర్వజ్ఞానియే. ఆయన అందరి దగ్గరా ఉన్నవాడు, ఎవనికి దూరమైనవాడు కాదు గనుక ఆయన అందరిని అంతటిని ఎరిగినవాడు. ఆయన పరిపూర్ణ జ్ఞాని. దావీదు 139వ కీర్తన ఆరంభములో ఇట్లు చెప్పుచున్నాడు : "యెహోవా నీవు నన్ను పరిశోధించి తెలిసికొనియున్నావు. నేను కూర్చుండుట నేను లేచుట నీకు తెలియును. నాకు తలంపు పుట్టకమునుపే నీవు నా మనస్సు గ్రహించుచున్నావు. నా నడకను, నా పడకను నీవు పరిశీలన చేసియున్నావు. నా చర్యలన్నిటిని నీవు బాగుగా తెలిసికొనియున్నావు. యెహోవా, మాట నా నాలుకకు రాకమునుపే అది నీకు పూర్తిగా తెలిసియున్నది. వెనుకను ముందును నీవు నన్ను ఆవరించియున్నావు. నీ చేయి నా మీద ఉంచియున్నావు. ఇట్టి తెలివి నాకు మించినది. అది అగోచరము, అది నాకందదు" (కీర్తన 139:1-6).

దేవుడు ఈ విశ్వమంతటిలోను, నిత్యత్వములోను అన్నిచోట్ల యున్నవాడు. మనము ఆయనకు కనబడకుండా ఎక్కడా యుండలేము, ఆయనకు తెలియకుండా యేమీ చేయలేము. ఏలయనగా ఆయన లేనిచోటు లేనేలేదు. ఆయన సమస్తమును ఎరిగినవాడు. తన్ను గూర్చి తానును ఎరిగినవాడు. ఆయన సర్వజ్ఞాని.

మానవ జ్ఞానము అసంపూర్ణమైనది. దేనిని మనము పరిపూర్ణముగా గ్రహించిన వారము కాము. మన జ్ఞానము పరిమితమైనది గనుక అపరిమిత జ్ఞానియైన దేవుని పూర్ణముగా గ్రహించుకొనలేము. ఈ లోకంలో జీవించిన మేధావులందరి జ్ఞానము కలిసి దేవుని జ్ఞానముతో సమానము కాజాలదు. "దేవుని వెర్రితనము మనుష్యుల జ్ఞానము కంటె జ్ఞానము కలది. దేవుని బలహీనత మనుష్యుల బలము కంటే బలమైనది" (I కొరింథీ 1:24). దేవుడు గతాన్ని గూర్చి, ప్రస్తుతాన్ని గూర్చి, భవిష్యత్తును గూర్చి పరిపూర్ణ జ్ఞానము గలవాడు. దేవుడు అనాది కాలము నుండి యున్న సంగతులను ఎరిగినవాడు (అపొ.కా.15:17). "ప్రభువా, నీవు సమస్తమును

ఎరిగినవాడవు" అని పేతురు చెప్పాడు (యోహాను 21:17). "ఆయన భూమ్యంతరముల వరకు చూచుచున్నాడు. ఆకాశము క్రింది దాని నంతటిని తెలిసికొనుచున్నాడు" అని దేవుని గూర్చి యోబు పలికాడు (యోబు 28:24). ఆకాశ నక్షత్రములను గూర్చి చెబుతూ ప్రవక్తయైన యెషయా యిట్లు వ్రాసాడు : "మీ కన్నులు పైకెత్తి చూడుడి, వీటిని ఎవడు సృజించెను? వీటి లెక్క చొప్పున వీటి సమూహములను బయలుదేరజేసి వీటన్నిటికిని పేరులు పెట్టి పిలుచువాడే గదా" (యెషయా 40:24). దేవుడు ఈ విశ్వాన్నంతటినీ ఎరిగినవాడు.

దేవుడు మానవుని గూర్చి సమస్తమును ఎరిగినవాడు. గతంలో జరిగిన దానిని ఆయన ఎరిగి యుండుటయే గాక, నాటి పరిస్థితులు వేరుగా యుంటే యేమి జరిగియుండేదో కూడ ఆయనకు తెలుసు. యేసు కాలము నాటి ప్రజలమధ్య చేయబడిన సూచకక్రియలు గనుక తూరు, సీదోను పట్టణములలో చేయబడిన యెడల, ఆ పట్టణములవారు మారుమనస్సు పొంది యుందురని ఆయన చెప్పారు. (మత్తయి 11:24). మానవునిలో యేమివున్నదో దేవుడెరుగును. "ఆయన దృష్టికి కనబడని సృష్టము ఏదియులేదు. మనమెవనికి లెక్క యొప్పచెప్పవలసి యున్నదో ఆ దేవుని కన్నులకు సమస్తమును మరుగులేక తేటగా యున్నది" (హెబ్రీ 4:13). పరలోక తండ్రి సెలవు లేకుండా ఒక్క పిచ్చుక యైనను నేలను పడదని, మన తల వెంట్రుకలన్నియు లెక్కింపబడియున్నవని యేసు ప్రభువు చెప్పారు. (మత్తయి 10:29, 30). "మీరు మీ తండ్రిని అడుగకమునుపే మీకు అక్కరగా నున్నవేవో ఆయనకు తెలియునని" కూడా ఆయన చెప్పారు. (మత్తయి 6:8). ఆయన సర్వజ్ఞాని.

అద్వితీయ సత్యదేవుడవైన నిన్నును, నీవు పంపిన యేసుక్రీస్తును ఎరుగుటయే నిత్యజీవమని యేసు ప్రభువు చెప్పారు (యోహాను 17:13). యెహోవా యందు భయభక్తులు కలిగియుండుట తెలివికి మూలము (సామెతలు 1:7). యెహోవా యందు భయభక్తులు గలిగి యుండుటయే జ్ఞానమునకు మూలము, పరిశుద్ధ దేవుని గూర్చిన తెలివియే వివేచనకు ఆధారము" (సామె 9:10). మనము దేవునికి దగ్గరగా

జీవింతుచున్న యెడల ఆయన జ్ఞానమే మనకు ఆదరణ. ఆయన నిన్ను, నన్ను, నీ అవుసరములను, నా అవుసరములను ఎరిగినవాడు. మన ఆత్మలను రక్షించువాడు. మనం యేసు ప్రభువు నందు విశ్వాసముంచి, పాపముల విషయమై మారుమనస్సు పొంది, పాప క్షమాపణ నిమిత్తం బాప్తిస్మము పొందిన యెడల మనలను రక్షించి తన సంఘముతో చేర్చుకొనును. నిత్యజీవార్థమైన జ్ఞానమును ప్రసాదించును !!

◆◆◆

# దేని వంటిదీ కాదు
## (Vnlike Any Other)

మానవ చరిత్రలో క్రొత్త నిబంధన క్రైస్తవ్యము వంటిది యేదీ లేదు. ఈ లోక మతాలతో దాన్ని పోల్చిచూస్తే వాటన్నిటికంటే అది ఉత్తమమైనదిగా కనబడును. ఒక చిన్న గుట్ట దగ్గర ఎవరెస్టు శిఖరం ఎట్లుండునో అది అట్లుండును. అయితే క్రైస్తవ్యంలో యున్న తేడా యేమిటి ? అది ఎందుకు అంత ప్రత్యేకమైన మతము ?

మొదటిగా నాస్తికత్వము నుండి అది ప్రత్యేకమైనది. దేవుడు లేడని చెప్పునది నాస్తికత్వము. "దేవుడు లేడని బుద్ధిహీనులు తమ హృదయములో అనుకొందురు" అని కీర్తన 14:1 చెప్పుచున్నది. బుద్ధిహీనుడు అనుమాట హెబ్రీభాషలో nabal అను మాటనుండి వచ్చినది. మెదడులో యేమీ లేనివాడని దాని యర్థం. నిజంగా బుర్రలో యేమీ లేనివాడు, ఖాళీ తలగలవాడు దేవుడు లేడనుకొంటాడు. దేవుడున్నాడని కొండంత రుజువుండగా దేవుడు లేడని అతడనుకొంటాడు.

దేవుడున్నాడని ప్రకృతి మనకు బోధించుచున్నది. "ఆకాశములు దేవుని మహిమను వివరించు చున్నవి, అంతరిక్షము ఆయన చేతిపనిని ప్రచురము చేయుచున్నది" యని దావీదు వ్రాసెను (కీర్తన 19:1). "ఆయన అదృశ్య లక్షణములు

అనగా ఆయన నిత్యశక్తియు దేవత్వమును జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుట వలన తేటపడుచున్నవి గనుక వారు నిరుత్తరులైయున్నారు.' ' అని రోమా 1:20 చెప్పుచున్నది. ఈ లోకం అంతా ఒక యాక్సిడెంటు వలన కలిగిందని నాస్తికుడు నమ్మును. నిర్జీవం నుండి జీవం ఉద్భవించినదని అతడు నమ్మును. అజ్ఞానం నుండి జ్ఞానము కలిగినదని అతడు నమ్మును. యిదెంత బుద్ధిహీనతయో !

ఈ విశ్వంలో కనబడే సంకల్పమంతటి వెనుక ఒక సంకల్పకర్త (Planner) ఉన్నాడని గ్రీకులు భావించారు. విశ్వంలో యున్న నమూనా యంతటి వెనుక ఒక నమూనా కారుడున్నాడని (Designer) వారు భావించారు. ఈ విశ్వం అంతా గొప్ప ఆలోచనా పూర్వకంగా చేయబడినదని గ్రహించి, దీని వెనుక ఒక గొప్ప ఆలోచన కర్త యున్నాడని వారు తలంచారు. " ప్రతి యిల్లును ఎవడైన ఒకని చేత కట్టబడును, సమస్తమును కట్టినవాడు దేవుడే" యని పౌలు చెప్పాడు (హెబ్రీ 3:3). పరలోకమందొక దేవుడున్నాడు అని దానియేలు చెప్పెను (దాని 2:28). "ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" అని క్రైస్తవ్యము ప్రకటించుచున్నది (ఆదికా 1:1).

రెండవదిగా, క్రైస్తవ్యము విగ్రహారాధన నుండి ప్రత్యేకమైనది. విగ్రహాలు మానవుల మదిలో సృజింపబడి వారి చేతులతో చేయబడును. పురాతన ఏథెన్సు పట్టణంలో ఏదైనా విగ్రహానికి తగులకుండా అడుగువేయడం కష్టం అనేవారు. పౌలు ఏథెన్సు వచ్చినప్పుడు అది విగ్రహములతో నిండియుండుట చూచి అతని ఆత్మ పరితాపము పట్టలేకపోయెను (అపొ.కా.17:16). నేడు కూడ విగ్రహారాధన ప్రబలియున్నది. పలు దేశాల్లో ప్రజలు విగ్రహములకు పూజచేయుట నేను చూచాను. విగ్రహములు వట్టివనియు, అవి దేవుండ్లు కావనియు, అవి వినలేవు చూడలేవు అనియు క్రైస్తవ్యము బోధించుచున్నది గనుక అది ప్రత్యేకమైనది.

క్రైస్తవ్యము ఒకే దేవుని గూర్చి బోధించు చున్నది కనుక అది ప్రత్యేకమైనది. దేవుడొక్కడే, "నేను మొదటివాడను, కడపటివాడను నేను తప్ప ఏదేవుడును లేడు"

అని యెషయా 44:6లో ఆయన చెప్పుచున్నారు. " ఆకాశమందైనను భూమి మీదనైనను దేవతలనబడినవి యున్నను, మనకు ఒక్కడే దేవుడున్నాడు; ఆయన నుండి సమస్తమును కలిగెను" (I కొరింధీ 8:5-6). "అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే, ఆయన అందరికి పైగాఉన్నవాడై అందరిలోను వ్యాపించి అందరిలో ఉన్నాడు" (ఎఫెసీ 4:6).

"చిన్నపిల్లలారా, విగ్రహముల జోలికి పోకుండ జాగ్రత్తగా ఉండుడి" యని భక్తుడైన యోహాను క్రైస్తవులను హెచ్చరించాడు (I యోహాను 5:21). మానవునికి దేవునికి మధ్య నుండేది ఏదైనా విగ్రహము కావచ్చును. కొందరు ధనాన్ని, కామాన్ని, అందాన్ని, వినోదాన్ని ఆరాధిస్తారు. ధనాపేక్ష విగ్రహారాధన యని పౌలు చెప్పాడు (కొలస్స 3:5). మనం ఈ లోకాన్ని దాని సంగతులను ఆశించిన యెడల దేవుని ఆజ్ఞను మీరినవారమవుతాము (I యోహాను 2:15). ఎవరినైనా, దేనినైనా ఆశించిన యెడల విగ్రహారాధన వలన అపరాధులమవుతాము.

మూడవదిగా క్రొత్త నిబంధన క్రైస్తవ్యము యూదా మతము నుండి ప్రత్యేకమైనది యూదులు యేసును నిరాకరించారు (యోహాను 1:11). వారు ఎదురుచూచుచున్న మెస్సీయ ఆయనే యని వారు విశ్వసించలేదు. "నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువు" అని పేతురు ఆయనను గూర్చి ఒప్పుకొన్నాడు (మత్తయి 16:16). నేటికిని యూదులు పాత నిబంధనను పాటింతురు. వారు క్రొత్త నిబంధనను అలక్ష్యము చేస్తారు, దాన్ని నిరాకరిస్తారు. " ఇదియు గాక యాజకులు మార్చబడినయెడల అవశ్యముగా యాజక ధర్మము సహామార్చబడును" అని పౌలు చెప్పాడు (హెబ్రీ 7:12). శ్రేష్ఠమైన వాగ్దానములను బట్టి నియమించబడిన శ్రేష్ఠమైన క్రొత్త నిబంధన మనకున్నదని కూడ అతడు చెప్పాడు (హెబ్రీ 8:6). క్రీస్తు పాత నిబంధనను సిలువకు మేకులతో కొట్టి దానిని ఎత్తివేసెను (కొలస్స 2:14; హెబ్రీ 9:15). మెస్సీయ ఇంకా వస్తాడని యూదులు ఎదురు చూచుచునే యున్నారు. "క్రీస్తు కూడ అనేకుల పాపములను భరించుటకు ఒక్కసారే అర్పింపబడి, తన కొరకు

కనిపెట్టుకొనియుండువారి రక్షణ నిమిత్తము పాపము లేకుండ రెండవసారి ప్రత్యక్షమగును" (హెబ్రీ 9:28).

నేటి యూదులను గూర్చి తలంచితే విచారం. వారొకప్పుడు దేవునిచే ఏర్పరచుకొనబడిన ప్రజలు. క్రీస్తును ఈ లోకములోనికి తెచ్చుటకు ఆయన వారినుపయోగించెను. అందరి కంటే ముందు వారు క్రీస్తును అంగీకరించవలసియున్నది. క్రీస్తును గూర్చి 333 కంటే పైగా యున్న ప్రవచనములు కలిగియున్న పాత నిబంధనను వారు కలిగియుండిరి. అందువలన వారు నిరుత్తరులై యున్నారు. క్రైస్తవ్యము ఇంచుమించు రెండువేల సంవత్సరముల నుండి యున్నది. యూదులలో అనేకులు క్రీస్తు సువార్తను విన్నారు గాని దాన్ని నిరాకరించారు. అందువలన వారు తమ్మును తామే నిందించుకోవాలి. రక్షింపబడాలంటే వారికి ఇంకో తరుణం అంటూ యేమీ ఉండదు. "మనుష్యులొక్కసారే మృతి పొందవలెనని నియమింపబడెను; ఆ తరువాత తీర్పు జరుగును" (హెబ్రీ 9:27).

నాల్గవదిగా, రోమన్ కేథలిక్కుల మతము నుండి క్రైస్తవ్యము ప్రత్యేకమైనది. క్రైస్తవ్యము క్రీస్తు శకము 33లో ఆరంభమాయెను (అపో.కా. 2:1-47). కేథలిక్కులు కొన్ని శతాబ్దముల తరువాత వచ్చిరి. ఆత్మీయ విషయాల్లో బైబిలు ఒక్కటి మాత్రమే అధికార స్థావరం అని క్రైస్తవ్యము నమ్మును గనుక అది ప్రత్యేకమైనది. కేథలిక్కులు పోపు యొక్కయు, సంఘ కౌన్సిళ్ల యొక్కయు తీర్మానములపై ఆధారపడుదురు.

పోపు పొరబడనివాడు కాదని క్రైస్తవ్యము ఉద్ఘాటించును. 1870లో జరిగిన వేటికన్ కౌన్సిల్‌లో పోపు పొరబడనివాడని (Infallible) కేథలిక్కులు తీర్మానించిరి. పొరబాటు చేయని వాడెవడును లేడు, ఏలయనగా "ఏ భేదమును లేదు; అందరును పాపము చేసి దేవుడను గ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు" (రోమా 3:23). కేథలిక్కుల పూజారుల పద్ధతిని క్రైస్తవ్యము ఖండించుచున్నది. క్రైస్తవులందరు యాజకులే యని బైబిలు బోధించుచున్నది. (I పేతురు 2:5, 9). పూజారుల యొద్ద పాపములు ఒప్పుకొనే పద్ధతిని (auricular Confession) క్రైస్తవ్యము ఖండించుచున్నది.

దేవుని యొద్ద మన పాపములు ఒప్పుకొనాలి; ఒకరి పాపములొకరు ఒప్పుకొనాలి (1యోహాను 1:9; యాకోబు 5:16). క్రైస్తవ్యము మరియను ప్రార్థించుట ఖండించుచున్నది. దేవునికి మానవునికి మధ్యవర్తి యేసుక్రీస్తు ఒక్కడేగాని మరియ కాదు (I తిమో 2:5). ప్రభురాత్రి భోజనంలో రొట్టె, ద్రాక్షరసములు క్రీస్తు శరీర రక్తములుగా మారునను సిద్ధాంతాన్ని క్రైస్తవ్యము నిరాకరించుచున్నది. రొట్టె ద్రాక్షారసములు క్రీస్తు శరీర రక్తములకు గురుతుగా మాత్రమే ఈయబడెను (మత్తయి 26:26-28). పూజారుల బ్రహ్మచర్యమును క్రైస్తవ్యము ఖండించుచున్నది. పేతురుకు వివాహమాయెను. పరిగదా అతడు మొదటిపోపు కూడ కాదు ( I కొరింధీ 9:5).

ప్రొటెస్టాంటుల డినామినేషన్లకు క్రైస్తవ్యము వేరైనది. డినామినేషన్లు విభజనను ప్రోత్సహిస్తాయి. క్రైస్తవ్యము ఏకత్వమును ప్రోత్సహిస్తాది. ఒకే ఒక్క శరీరమున్నదని బైబిలు బోధించుచున్నది. ఆ ఒకే శరీరమే సంఘము (ఎఫెసీ 4:4; 1:22-23; కొలస్స 1:18). మంద ఒక్కటే, గొర్రెల దొడ్డియు ఒక్కటే (యోహాను 10:16), ఆ ఒకేమందకు ఒకే కాపరియున్నాడు (యోహాను 10:16; కొలస్స 1:18).

మత శాఖలు అనేక విశ్వాస ప్రమాణ పుస్తకాలను పాటిస్తారు. క్రైస్తవ్యము బైబిలును మాత్రమే అంగీకరిస్తాది (యోహాను 12:48; రోమా 2:2; యోహాను 17:17).

పరలోకానికి వెళ్లే మార్గాలు చాల యున్నాయని మతశాఖలు బోధిస్తారు. క్రైస్తవ్యము "ఈ మార్గము" అని 9 సార్లు అపొస్తలుల కార్యములలో చెప్పబడినది (అపొ.కా.24:14). "నేనే మార్గమును" అని యేసు చెప్పెను (యోహాను 14:6; యెషయా 35:8). పౌలు యిట్లు సమీక్షించాడు : "శరీరమొక్కటే, ఆత్మయు ఒక్కడే; ఆ ప్రకారమే మీ పిలుపు విషయమై యొక్కటే, నిరీక్షణ యందుండుటకు పిలువబడితిరి. ప్రభువు ఒక్కడే, విశ్వాసమొక్కటే, బాప్తిస్మమొక్కటే.. అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే. ఆయన అందరికి పైగాయున్నవాడై అందరిలోను వ్యాపించి అందరిలో యున్నాడు" (ఎఫెసీ 4:4-6).

చివరిగా స్వేచ్ఛాతత్వానికి (liberalism) క్రైస్తవ్యము వేరైనది. స్వేచ్ఛాతత్వపరులు బైబిలు యొక్క ఆత్మావేశాన్ని నిరాకరిస్తారు. అయితే బైబిలు దేవుని వాక్యమని, అది పరిశుద్ధాత్మావేశ లేఖకులచే వ్రాయబడినదని, సర్వ సంపూర్ణమైనదని క్రైస్తవ్యము నమ్మును. (2 తిమో 3:16-17; 2 పేతురు 1:20-21). స్వేచ్ఛాతత్వపరులు. క్రీస్తు కన్యకు జన్మించాడని నిరాకరిస్తారు; ఆయన అద్భుతములను పునరుత్థానాన్ని నిరాకరిస్తారు. పరలోకం, నరకం వున్నదో లేదో కూడా వారెరుగరు. అట్టివారితో యోగ్యులెవరైనా ఎట్లు సహవసిస్తారు ?

ఈ లోకంలో యున్న మతాల అన్నిటికంటె క్రైస్తవ్యము వేరైనది. తత్ఫలితముగా అది ఘోరహింసల నెదుర్కొన్నది. అదే సత్య మార్గము.

-జాన్ స్టేసీ

◆◆◆

## గమనిక గమనిక

జాన్‌స్టేసీ గారు వ్రాసిన 28 మంచి ప్రసంగములు "పరిశుద్ధులకు పాపులకు ప్రసంగాలు" అనే మంచి పుస్తక రూపములో వెలువడినవి. వలయువారు పదిరూపాయల పోస్టేజీ స్టాంపులను గాని, మనియార్డరును గాని దిగువ చిరునామాకు పంపి పొందండి :

SATYA VANI, P.O.BOX. NO.80, KAKINADA - 533 001

# రాజైన యెహోషాపాతు యొక్క ప్రఖ్యాతి, పతనము
# (The Rise and Fall of King Jehoshaphat)

సౌలు, దావీదు, సొలొమోనులు సమైక్య ఇశ్రాయేలు రాజ్యమును ఒక్కొక్కరు నలువది సంవత్సరములు మట్టుకు పాలించిరి. సొలొమోను తరువాత అది ఉత్తర రాజ్యముగను, దక్షిణ రాజ్యముగను విభజింపబడెను. ఉత్తరాన్న ఉన్న ఇశ్రాయేలు రాజ్యములో పది గోత్రములుండగా, దక్షిణాన్న యూదా రాజ్యములో దావీదు వంశస్థులగు రెండు గోత్రములుండిరి. ఇశ్రాయేలు దేశమును పాలించిన రాజులందరు దేవుని దృష్టిలో దుర్మార్గులైరి. వారు విగ్రహముల నారాధించుచు విగ్రహారాధనను ప్రోత్సహించిరి. యూదయను పాలించిన వారిలో కొంతమంది మంచి వారుండిరి. వారిలో యెహోషాపాతు ఒకడు.

యెహోషాపాతు యూదయను 25 సంవత్సరముల మట్టుకు జ్ఞానము గలవాడై పాలించెను. అతడనేక సంస్కరణలను ప్రవేశపెట్టెను. అతడు లేవీయులను, యాజకులను, ఉపదేశకులను దేవుని ధర్మ శాస్త్రమునుపదేశించుటకు ఆయా పట్టణములకు పంపుచుండెను. తద్వారా ప్రజలను దేవునివైపు మళ్లించుటకు ప్రయత్నించెను. "యెహోషాపాతు యెరూషలేములో నివాసము చేయుచు బేయేర్షెబా నుండి ఎఫ్రాయీము మన్యము వరకు జనులమధ్యను సంచరించుచు, వారి పితరుల దేవుడైన యెహోవావైపు వారిని మళ్లించెను. మరియు అతడు ఆయా పట్టణములలో .. న్యాయాధిపతులను నిర్ణయించెను" (2 దినవృ 19:4, 5). అతడు తన పితరుల మార్గములో నడిచెను గనుక దేవుడతనికి తోడైయుండెను. దావీదు వలె అతడును బయలు దేవతను గాక యెహోవా దేవుని నారాధించెను. అతడు తన పితరుల మార్గములో నడుచుచు, ఇశ్రాయేలు వలె గాక దేవుని ఆజ్ఞలను పాటించెను. అతడు తన రాజ్యమును స్థిరపరచెను. యూదావారందరు అతనికి బహుమానము లిచ్చిరి. ఫిలిష్తీయులలో కొందరును, అరబీయులును అతనికి పన్నును, కానుకలను ఇచ్చుచు



జె.సి. బెయిలీ

1903 - 2001

# ఇప్పుడే అందిన వార్త

2001 జూలై 2వ తేదినాడు కెనడా కాలమాన ప్రకారం ఉదయం 10.30 గంటలకు సోదరులు జె.సి. బెయిలీ గారు ప్రభువునందు నిద్రించిరి.

బెయిలీ గారు 1903 సెప్టెంబరు 13న కెనడాలో జన్మించిరి. 1963లో మొదట అప్పటి అస్సాం రాష్ట్ర ముఖ్యపట్టణమగు షిల్లాంగ్‌లో భారతదేశంలో క్రీస్తు సంఘముల దరపున మిషనెరీ పనిని ప్రారంభించిరి. ఆ సంవత్సరాంతమునకు మద్రాసు చేరుకొని అక్కడ పనిని ప్రారంభించిరి. 1964 ఫిబ్రవరిలో జాషువాగూటం గారు ఆయన చేతిలో బాప్తిస్మము పొందిన ప్రధమ ఆంధ్రుడయ్యారు. అటు తరువాత వారిద్దరు పలు ప్రాంతములలో క్రొత్త నిబంధన సత్యమును చాటుచు పని చేసిరి. జాషువాగారి తరువాత నెహెమ్యా గూటంగారు తమ కాలేజీ విద్యను ముగించుకొనగానే బెయిలీగారు ఆయనకు బోధించి క్రీస్తులోనికి మార్చిరి. నాటినుండి నెహెమ్యా - జాషువా గూటంగార్లు తమ యవ్వన కాలములోనే బెయిలీగారితో కలిసి పనిచేస్తు గొప్ప సువార్త చేసిరి.

బెయిలీ గారు 1964 నుండి 1990 వరకు ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో పనిచేసిరి. ఆ రోజుల్లో ఈనాడున్న సౌకర్యములు లేకపోయినను ఆయన వెళ్లలేని జిల్లాగాని, పల్లెగాని లేదు. రాత్రనక పగలనక కష్టపడి ఆయన సువార్త చేస్తు వేలకొలది ప్రజలను క్రీస్తులోనికి మళ్లించిరి. ఆధునిక యుగంలో భారతదేశానికి క్రొత్త నిబంధన క్రైస్తవ్యాన్ని తెచ్చి అందించిన మహా వ్యక్తి ఆయన. ఆయనద్వారా ఆంధ్రలోను, ఇరుగుపొరుగు రాష్ట్రాలలోను సత్య

వాక్యము త్వరితగతిని వెల్లడయ్యింది. 1963 నాటికి భారతదేశం అంతటిలోను రెండే రెండు క్రీస్తు సంఘములుండగా, ఈనాడు ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే పదివేలకు పైగా స్థానిక క్రీస్తు సంఘములున్నట్లు అంచనా. బెయిలీ గారు భారతగడ్డపై అడుగు పెట్టిన నాటినుండి నేటి వరకు కొన్ని లక్షల ప్రజలు సత్యమును గ్రహించి క్రీస్తు సంఘ సభ్యులైరి, అవుచున్నారు కూడ.

మొదటి శతాబ్దములో క్రీస్తు యొక్క సత్యసువార్తను చాటుచు అపొస్తలుడైన తోమా భారత దేశమునకు వచ్చినట్లు చరిత్ర చెప్పుచున్నది. అటు తరువాత 20వ శతాబ్దములో జె.సి. బెయిలీ గారు వచ్చి తోమా ప్రకటించిన సువార్తనే ప్రకటించుచు క్రొత్త నిబంధన క్రైస్తవ్యమును పునరుద్ధరించుటకు పూనుకొనిరి. 37 సంవత్సరముల స్వల్ప కాలములోనే ఇంత త్వరితగతిని వ్యాపించిన మత సంబంధమైన ఉద్యమము మరింకొకటి చరిత్రలో కానరాదు. ఇంత గొప్ప ఫలితమును సాధించిన బెయిలీ గారు ధన్యులు.

బెయిలీ గారు నిర్గర్వి, నిరాడంబరుడు, గొప్ప బైబిలు పండితుడు, దాని విద్యార్థి కూడ. ఆయన బహు జాలిపరుడు. ఉదార స్వభావుడు. ఆంధ్రప్రదేశ్‌లో అనేకులకు ఆత్మీయ తండ్రి. ఆయన సతీమణి కొన్ని సంవత్సరముల క్రితము ఆయనకంటే ముందుగనే పరమందున్న తండ్రి యొద్దకు చేరుకొనిరి. ఇప్పుడు బెయిలీ గారు తన 98వ యేట విడిచి వెళ్లిన కుమారులు, కుమార్తెలు, మనుమలు, ముని మనుమలు, ముని మనుముల పిల్లలున్నారు. వారందరి కొరకు ప్రార్థించుదాం. ఆయన ప్రారంభించిన పనిని క్రీస్తు వచ్చువరకు కొనసాగించుదాం.

వచ్చిరి. అందువలన అతనికి ఐశ్వర్యమును, ఘనతయు అధికముగా కలిగెను. దేవుని మార్గములో నడుచుటకు అతని హృదయము సంతోషించెను. అతడు ఉన్నత స్థలములను దేవతా స్థంభములను యూదాలో నుండి తీసివేసెను (2 దినవృ 17:3-6).

## రాజు యొక్క ప్రఖ్యాతి

2 దిన వృత్తాంతములు 18వ అధ్యాయములో అతడు ఇశ్రాయేలు రాజైన ఆహాబుతో కలిసి రామోత్గిలాదు మీదికి యుద్ధమునకు వెళ్లవచ్చునో లేదో యని దేవుని విచారించినట్లు మనము కనుగొనగలము. అయితే దేవుని ప్రవక్తయగు మీకాయా యొక్క సలహాకు వేరుగా వారు యుద్ధమునకు పోయిరి. ఆ యుద్ధములో ఇశ్రాయేలు రాజగు ఆహాబు చనిపోయెను.

యెహోషాపాతు అంతకంతకు గొప్పవాడై యూదా దేశము నందు కోటలను, సామాగ్రిని నిలువచేయు పట్టణములను కట్టించెను. అతని క్రింద పరాక్రమశాలులైన సైన్యముండెను (2 దినవృ 17:12-19).

మోయాబీయులును, అమ్మోనీయులును, మెయోనీయులలో కొందరును దండెత్తి యెహోషాపాతు మీదికి రాగా అతడు భయపడి యెహోవా యొద్ద విచారించుటకు మనస్సు నిలుపుకొనెను. యూదా అంతట ఉపవాస దినము ఆచరింపవలెనని ప్రకటింపగా ప్రజలందరు యెరూషలేములో దేవుని సహాయము నభ్యర్థించుటకు గాను కూడుకొనిరి. ఆసాపు సంతతివాడును లేవీయుడునగు యహజీయేలు మీదికి దేవుని ఆత్మరాగా, అతని ద్వారా ప్రభువు వారికి విజయాన్ని వాగ్దానం చేసెను.

అంతటవారు ఉదయముననే లేచి తెకోవ అరణ్యమునకు పోయిరి. యెహోషాపాతు జనులను హెచ్చరిక చేసి యెహోవాను స్తుతించుటకు గాయకులను ఏర్పరచి, వారు పరిశుద్ధాలంకారములు ధరించి సైన్యము ముందరనడుచుచు, యెహోవా కృప నిరంతర ముండును. ఆయనను స్తుతించుడి అని స్తోత్రము చేయుటకు వారిని

నియమించెను. వారు పాడుటకును స్తుతించుటకును మొదలుపెట్టగా యెహోవా యూదా వారి మీదికి వచ్చిన అమ్మోనీయుల మీదను మోయాబీయుల మీదను శేయీరు మన్యవాసుల మీదను మాటుగాండ్రను పెట్టెను గనుక వారు హతులైరి. దేవునికి స్తుతి గానము చేయుచు వారు యుద్ధము జయించిరి. సరిగదా శత్రుశవముల యొద్ద విస్తారమైన ధనమును, ప్రశస్తమైన నగలును వారికి కనబడెను. వారు కొంచుపోలేనంత విస్తారమైన ధనము వారి వశమాయెను. కొల్లసొమ్ము విస్తారమై నందున దానిని కూర్చుటకు మూడు దినములు పట్టెను. ఇశ్రాయేలీయుల శత్రువులతో యెహోవా యుద్ధము చేసెనని దేశముల రాజ్యనివాసులు వినగా దేవుని భయము వారందరి మీదికి వచ్చెను. ఈ ప్రకారము అతని దేవుడు చుట్టు వున్న వారిని జయించి అతనికి నెమ్మది ననుగ్రహింపగా యెహోషాపాతు రాజ్యము నిమ్మళముగా నుండెను. దేవునితో అతడు సహవాసము కలిగి యున్నంతవరకు దేవుడతనికి తోడైయుండెను.

## రాజు యొక్క పతనము

యెహోషాపాతు ఇశ్రాయేలు రాజైన ఆహాబుతో వియ్యమందినందున దేవుని ఉగ్రతను తనమీదికి తెచ్చుకొనెను. ఆహాబుతో కలసి అతడు రామోత్గిలాదు మీదికి యుద్ధమునకు పోయెను. ఆ యుద్ధములో ఆహాబు చనిపోగా, దీర్ఘ దర్శియగు యెహూ నీవు భక్తిహీనులకు సహాయము చేసి యెహోవా శత్రువులకు స్నేహితుడవైతివి గదా ? అందువలన యెహోవా సన్నిధినుండి కోపము నీ మీదికి వచ్చునని చెప్పెను (2 దినవృ 19:2). యెహోషాపాతు తన పాలన చివరిభాగములో మిక్కిలి దుర్మార్గముగా ప్రవర్తించిన అహజానాతో స్నేహము చేసెను. అప్పుడు మారేషా వాడును దోదావాహు కుమారుడునగు ఎలీయెజెరు - నీవు అహజ్యాతో స్నేహము చేసికొంటివి గనుక యెహోవా నీ పనులను భంగము చేయునని యెహోషాపాతు మీద ప్రవచనమొకటి చెప్పెను (2 దినవృ 20:35-37).

యెహోషాపాతు దేవునితో నడిచినంత కాలము ఆశీర్వదించబడెను, ధనికుడయ్యెను. అయితే దుర్మార్గులైన రాజులగు ఆహాబు, అహజ్యాలతో అతడు ఏకీభవించినప్పుడు ఆయన దృష్టికి కీడు చేసిన వాడాయెను.

అవిధేయతను బట్టి సౌ        లు రాజు శిక్షించబడెను. వ్యభిచార కారణము వలన దావీదు శిక్షననుభవించెను. సొలొమోను అన్యస్త్రీలను వివాహమాడినందున ఇశ్రాయేలు దేశము రెండు ముక్కలాయెను. ఇశ్రాయేలు దేశపు దుర్మార్గ రాజులతో సహవాసము చేసినందున యెహోషాపాతు శిక్షించబడెను.

"మీరు అవిశ్వాసులతో విజోడుగా ఉండకుడి. నీతికి దుర్నీతితో ఏమి సాంగత్యము ? వెలుగునకు చీకటితో ఏమి పొత్తు ? క్రీస్తునకు బెలియాలుతో ఏమి సంబంధము ? అవిశ్వాసికి విశ్వాసితో పాలెక్కడిది ?" యని అపొ.పౌలు చెప్పుచున్నాడు (2 కొరింథీ 6:14-16). హనోకు దేవునితో నడిచెను గనుక దేవుడతని కొనిపోయెను. విగ్రహారాధికులతో సాంగత్యము చేయకుండు నిమిత్తము అబ్రాహామును దేవుడు పిలిచెను. అతడు దేవునికి లోబడి ఈలోక జనాంగములన్నిటికి దీవెనకు కారకుడాయెను. పోతీఫరు భార్యతో సహవసించనందున యోసేపు దీవించబడెను, ఐశ్వర్యవంతుడాయెను. మోషే అల్పకాలము పాపభోగము అనుభవించుట కంటె దేవుని ప్రజలతో శ్రమ అనుభవించుట మేలని యోచించి ఫరో కుమార్తె యొక్క కుమారుడనని అనిపించుకొనుటకు ఒప్పుకొనలేదు" (హెబ్రీ 11:24-25). యెహోషువాయు, అతని కుటుంబమును విగ్రహములను గాక సజీవుడైన దేవుని సేవించుటకు ఎంచుకొనెను.

## దుష్ట సాంగత్య ఫలితము

దుష్టసాంగత్యము మంచి నడవడిని చెరుపునని వారందరు ఎరుగుదురు (I కొరింథీ 15:33). దుష్టుల నుండి మనం దూరముగా యుండాలని ప్రభువు మనకు తరచు హెచ్చరిక చేయుచున్నారు. ఏలయనగా పులిసినపిండి కొంచెమైనను ముద్ద అంతయు పులిచేయును (గలతీ 5:9).

హవ్వ దేవుని సహవాసమును వీడి అపవాది మాటలకు లోబడినప్పుడు పాపములో పడింది. శిక్షించబడింది. ఏశావు అన్య స్త్రీలను వివాహమాడి శ్రమల పాలయ్యెను. పరాక్రమశాలుడైన సంసోను దుష్టుల ఆలోచన చొప్పున నడిచి, పాపుల మార్గమున నిలిచి, అపహాసకులు కూర్చుండు చోట కూర్చొని పతనమయ్యెను.

దుష్ట సాంగత్యము అపాయకరము. దుష్టులతో సహవాసము చేస్తే యెహోషాపాతుకు జరిగినట్లు దేవుని ఉగ్రతమన మీదికి వచ్చును. "ఎందుకనగా మన ప్రభువైన యేసుక్రీస్తు ద్వారా రక్షణ పొందుటకే దేవుడు మనలను నియమించెను గాని ఉగ్రత పాలవుటకు నియమించలేదు" (I థెస్స 5:9). మానవులను రక్షించుటకు తండ్రియైన దేవుడు తన ఏకైక కుమారుడైన యేసుక్రీస్తును ఈ లోకమునకు పంపెను. ఆయన యందు విశ్వాసముంచి, పాపముల విషయమై మారు మనస్సు పొంది బాప్తిస్మము పొందిన వారు రక్షింపబడుదురు. సంఘముతో చేర్చబడుదురు. నిత్యజీవమునకు వారసులవుదురు "ఏలయనగా పాపము వలన వచ్చు జీతము మరణము ; అయితే దేవుని కృపావరము మన ప్రభువైన యేసుక్రీస్తునందు నిత్యజీవము" (రోమా 6:23). "కాబట్టి యిప్పుడు క్రీస్తు యేసునందున్న వారికి ఏ శిక్షా విధియు లేదు" (రోమా 8:1).

"ఎవడైనను నాయందు నిలిచి యుండని యెడల వాడు తీగెవలె బయట పారవేయబడి యెండిపోవును; మనుష్యులు అట్టివాటిని పోగుచేసి అగ్నిలో పారవేతురు, అవి కాలిపోవును" అని యేసు ప్రభువు చెప్పెను (యోహాను 15:6). మనం క్రీస్తులో యుంటూ లోకముతో సాంగత్యము చేయలేము. మరణ పర్యంతము మనము క్రీస్తుతో ఆయన వాక్యము ద్వారాను, ప్రార్థన ద్వారాను సహవాసము కలిగియుండాలి. ఆదిమ క్రైస్తవులు అపొస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టె విరుచుటయందును, ప్రార్థన చేయుటయందును ఎడతెగక యుండిరి (అపొ.కా.2:42).

పరిశుద్ధులతో మనం సహవాసం కలిగియుంటే, బలపడగలము. గాని దుష్టులతో సాంగత్యం చేస్తే దేవుని ఉగ్రతకు పాలవుదుము. "ఈ లోక స్నేహము

దేవునితో వైరమని మీ రెరుగరా? కాబట్టి యెవడు ఈ లోకముతో స్నేహము చేయగోరునో వాడు దేవునికి శత్రువగునని" యాకోబు చెప్పెను (యాకోబు 4:4). నీవు దేవుని మిత్రుడవా ? లేక శత్రువువా ? దేవుడు నీ పక్షమున యుండగోరుచున్న యెడల దుష్టసాంగత్యమును విడనాడుము. లేదా యెహోషాపాతు వలె దేవుని ఉగ్రతకు పాత్రుడవగుదువు.

**- కవిత గౌతం, కాకినాడ**

◆◆◆

# యేసు సాధించిన విజయములు

యేసు జీవిత చరిత్రను ఏ ఒక్కరూ సంపూర్ణముగా వ్రాయలేదు. అట్లు వ్రాయవలెనంటే భూలోకమే సరిపోదని యేసు ప్రియశిష్యుడు యోహాను అభిప్రాయము (యోహాను 21:25). ఆయన జీవితములో నుండి కొన్ని సంఘటనలను తీసుకొని యేసు తన లక్ష్యములను ఎట్లు సాధించెనో నలుగురు గ్రంథకర్తలు సూచించారు. యేసు చేసిన చర్యలకు ప్రజలు యేవిధముగా స్పందించినారో దానిని కూడా వారు మనకు తెలియజేశారు. ఉపదేశింపబడిన ఆ సంగతులు నిశ్చయముగా జరిగినవని మనము గ్రహించవలెనని వారు ఒక వరుసక్రమములో వ్రాసారు. యేసు దేవుని కుమారుడైన క్రీస్తు అని నమ్మి ఆయన నామములో జీవము పొందాలనేది వారి ముఖ్య ఉద్దేశమై యున్నది (లూకా 1:1-4, యోహాను 20:30-31).

యేసు భూమిపై ఉండగా తన లక్ష్యములను ఏవిధముగా నెరవేర్చెనో, సాతాను ఆయన లక్ష్యములకు ఎట్లు వ్యతిరేకముగా పనిచేసెనో తెల్సుకొనుటకు మనము ఆ సువార్తలను చదివినపుడు రచయిత ఉద్దేశ్యము పూర్తిగా గ్రహించుటకు వీలుండును. గ్రంథకర్త యొక్క ఉద్దేశ్యము తెలుసుకొనకుండా ఎన్నిమారులు చదివినను పాఠకులు సందేశమును పొందలేరు. యేసు బోధలు మన స్వభావమునకు అనుగుణ్యమైనవి. మనవలెంటి శరీరము కల్గియుండి ఎన్నడును చెడు ఎన్నుకొనకుండా అన్నిమారులు

మంచినే ఎన్నుకొనుటవలన మానవులందరికి ఆయన మార్గము, సత్యము, జీవము అయినాడు.

సువార్తలను చదువునపుడు రచయితలు యేసుయొక్క శక్తి సామర్థ్యములను గురించి ఏమి నమ్ముచూ వ్రాసిరో మనము ఎరుగవలసియున్నది.

మన జీవితములోని ప్రతీ అవసరతను ఎరిగిన వ్యక్తిగా ఆయనను మనం ఎరుగవలసియున్నది. మనం ఎందుకొరకు సృజింపబడినామో, మనలో ఎలాంటి శక్తి సామర్థ్యములు ఉన్నవో గ్రహించలేని స్థితిలో నశించిపోయి మానవుడు ఉన్నాడు. "అయితే యేసు అందరిని ఎరిగినవాడు కనుక ఆయన తనను వారి వశము చేసికొనలేదు. ఆయన మనుష్యుల ఆంతర్యము ఎరిగినవాడు గనుక ఎవడును మనుష్యుని గురించి ఆయనకు సాక్ష్యమియ్యనక్కరలేదు" (యోహాను 2:24-25). పాఠకులను ఆయన ఎరుగును. పాఠకులే ఆయనను పూర్తిగా ఎరుగరు. నేడు చదివే అనేకమంది పాఠకులు యేసుక్రీస్తు సర్వశక్తిని, సర్వజ్ఞానమును, సర్వాధికారమును, సాత్వికము, దీనమనస్సు, కనికరము, దీర్ఘశాంతము కల్గియున్న వ్యక్తిగా ఆయనను చూడకపోవుట వలన గ్రంథకర్త ఉద్దేశ్యము గ్రహించకున్నారు. (యోహాను 1:3;13:3).

మానవునిలో విశ్వాసము కనుగొనినపుడు ఆయన ఆనందించెను, హృదయ కాఠిన్యమునకు దుఃఖపడెను. పాఠకులు ఆయనను తమ నమ్మకాలకు సరిపోయే వ్యక్తిగా మాత్రమే చూస్తూ ఆయన భూమిపై వేటిని నెరవేర్చెనో చూడకపోవడం వలన ఆయనను వెంబడించలేక పోవుచున్నారు. యేసు పరిచర్య, విజయము ప్రజాభిప్రాయము మీద ఆధారపడి ఉండనందుకు దేవునికి వందనములు.

మానవులు ఏఏ రంగములలో తమ ప్రతిభను నిరూపించుకొనవలెనని ప్రయత్నము చేయుదురో ఆయా రంగములలో తన గురి కల్గిలేదు అనేది ఒక వాస్తవము (యోహాను 6:38). ఉదాహరణకు ఒక ధనవంతుడుగా గాని, శౌర్యవంతుడుగా గాని, భౌతికమైన రాజుగా చేయగోరినపుడు ఆయన వారిమధ్య నుండి తప్పించుకొనెను. (యోహాను 5:15).

యేసు భౌతిక ఆకారము చూడగోరి వచ్చిన గ్రీసు దేశస్తులకు ఆయన కనబడకుండా దాగియుండెను. (యోహాను 12:20-23,31) ఆయన అందరిని ఆకర్షించుకొనే విధానము, సిలువ మరణము తర్వాత ఆత్మ సంబంధముగా జరిగింది. (యోహాను 12:32).

మనం ఎన్నుకొనే నాయకునిలో మనకు ఇష్టమైన లక్షణాలను, అర్హతలను మనం వెదుకుతాము. కాని యేసులో మనం చూడగోరేది మనం ఊహించే వ్యక్తిగా కాదు, ఆయన నిజముగా ఎలాగు ఉన్నాడో ఆలాగునే మనం ఆయనను చూడాలి. అప్పుడే ఆయన అసలైన గురిని, కదలికను మనం గ్రహించగలము. ఆయనను నిజంగా వెంబడించగలం. ఆయన ఎక్కడనుండి వచ్చెనో, ఎక్కడికి వెళ్ళియుండెనో మనం ఎరిగి ఆయన ప్రస్తుతము లోకములోని మానవులను దేవునితో సమాధానపరచు కార్యక్రమము సంఘము ద్వారా ఎలాగు పనిచేయుచున్నాడో మనం ఎరిగి ఉన్నట్లయితే ఆయన భూమిపై ఏమి సాధించెనో, దేనిని స్థాపించెనో ఆ విజయములో మనము పాలివారము కాగలము.

ఆయన దేవుని చిత్తమును సంపూర్ణముగా నెరవేర్చెను (యోహాను 6:38) దేవుని తన క్రియల వలన, బోధల వలన బయలుపరచియున్నాడు. (యోహాను 1:18). దేవుని రాజ్యమును ప్రకటించుచు సంచరించెను. (లూకా 4:43), నశించిన పాపులను ఆయన వెదకి రక్షించెను (లూకా 19:10). ఈ పరిచర్య తర్వాత కూడా కొనసాగులాగున తన శిష్యులకు తర్ఫీదు ఇచ్చెను (మత్తయి 4:19-20). యేసు సిలువలో మరణించుట ప్రమాదవశాత్తు జరిగినది కాదు ఆయన చిత్తమునకు వ్యతిరేకముగా జరిగినది కాదు. ఆయన మన పాప ఋణములను చెల్లించుటకు మరణించియున్నాడు (యోహాను 10:18); మత్తయి 20:28). క్రీస్తును గురించి పాత నిబంధన కాలములోనే ముందు చెప్పబడిన ప్రవచనములను నెరవేర్చియున్నాడు (మత్తయి 5:17). ప్రయాసపడి భారము మోయుచున్న సమస్తమైన వారలను తన యొద్దకు రమ్మని ఆయన పిలుచుచున్నాడు. ఆయన వారికి విశ్రాంతినిత్తునని

వాగ్దానము చేసెను. (మత్తయి 11:28-30). మనం ఆహ్వానించినట్లయితే దేవుని రాజ్యము మన హృదయములోనికి వస్తుంది (ప్రకటన 3:20) లూకా 17:20-21).

క్రొత్తగా జన్మించుట ద్వారా ఎవరైనా దేవుని రాజ్యములో ప్రవేశించవచ్చును. (యోహాను 3:3-5).

-ఎస్.జె.బిష్వర్, రాజమండ్రి

◆◆◆

# ఆశ్చర్యముగా చేయబడిన మానవుడు (Fearfully and Wonderfully Made)

మానవ శరీరముతో పోల్చబడుటకు సాటియైన అద్భుతములు ఈ లోకములో ఏమీ లేవు. మానవుని విజ్ఞానము, యంత్రములు సాధనముల యొక్క మెరుపంతయు మానవ శరీర అరమరకలో ఇట్టే వెలసిపోవును. మానవుని అస్థిపంజరములో చెవిలోని యెముకలను మినహాయించి ఉక్కును మించి మన్నగల 200 ఎముకలున్నవి. ప్రతి కీలు లోను అతి బిగువుగా అమర్చబడి దానిలో తయారుచేయబడే నూనెలో అవి తిరుగుచు యుండును.

సామాన్యముగా ప్రతి మానవుడు రోజుకి 2500 కేలరీల శక్తిని తన శరీరములో తయారుచేయును. ఇది 25 కప్పుల కాఫీ తయారుచేయుటకు సరిపడే వేడి. మెదడులో ఒక తాపక్షమ నిర్ధారకము (Thermostat) యున్నది. అది నీ శరీరములోని ప్రతి భాగముతోను సంబంధము కలిగియున్న నరములతో తయారు చేయబడినది. శరీరములో ఒక భాగము వేడెక్కిపోయినా లేక చల్లబడిపోయినా కంట్రోలు కేంద్రమునకు సిగ్నలు ద్వారా వెంటనే తెలియజేయబడును. తద్వారా చర్మములోని రక్తనాళములు వేడినిచ్చుటకో లేక చల్లదనము చేయుటకో వ్యాపకమగును లేదా సంకోచించును.

:క్కువ చల్లదనము కావలసివచ్చినప్పుడు చెమటపట్టును. దేవుడు నీకిచ్చిన ఎయిర్ ండిషన్ పద్దతి కంటె శ్రేష్టమైన పద్ధతిని ఏ మానవుడు కనిపెట్టలేదు.

నీ శరీరములోని ఆశ్చర్యకరమైన విద్యుచ్ఛక్తి పద్ధతి నొకమారు గమనించుము. అది ఊహాతీతమైనది. మానవుని మెదడులో 100 లక్షల నరముల కణములున్నవి. ఈ ప్రతి కణములోని న్యూట్రాను ఒక్కొక్కటి .07 వోల్టుల శక్తితో పనిచేయును. నీ కళ్ళు 300000 "ప్రైవేట్ టెలిఫోన్ లైన్లతో" మెదడుకు అతికించ (కనెక్టచేయ) బడినవి. పూలజాడీలోని పూలగుత్తిని నీ వొకమారు చూడగానే నీ మెదడు, ఒక్కొక్క పువ్వుయొక్క సైజు, ఆకారము, రంగు, రంగుల పరివర్తము, వాసన మొదలగు వాటిని గూర్చి కొన్నివేల ప్రత్యేక వర్తమానముల నందుకొనును.

మానవుడు తయారుచేసిన అతి సున్నితమైన యాంత్రిక హస్తము దేవుడు నీకిచ్చిన హస్తము దగ్గర ఎందుకు పనికిరాదు. దేవుడు తయారుచేసిన చేయి వాద్యములను వాయించును, యంత్రములను నడుపును, చిత్రములను చిత్రీకరించును, అతి సున్నితమైన ఆపరేషన్లను చేయును. దేవుడిచ్చిన చేయి ఆశ్చర్యకరమైన ఒక పరికరము.

నీ కన్ను మానవునికి తెలిసిన బహు వెలగల ఒక కెమెరా. ఏ కెమేరాలో లేని ఆంతరంగిక అడ్జస్ట్‌మెంటులతోను, ఆటోమేటిక్ పద్ధతితోను అది తయారు చేయబడినది. ప్రతి కన్నులోను పదికోట్ల నరముల కణములున్నవి. అవన్నియు పరిపూర్ణ ఏకత్వముతో పనిచేయుట వలన నీవు దగ్గిరగా యున్నవాటిని, బహు దూరముగా యున్నవాటిని, వాటి వాటి స్వాభావిక రంగులలో చూడగలుగుచున్నావు.

నీ చెవులు 1500 శృతులు గల శ్రావణ యంత్రములు. మామూలు పియానాలో 88 శృతులు మాత్రమే యున్నవి. మానవ చెవి ఎంత సున్నితమైనదంటే అతి నిశ్శబ్దముగా యున్న (Sound Proof) గదిలో రక్తనాళముల నుండి రక్తము ప్రవహించు శబ్దమును నిజముగా నీవు వినవచ్చును.

గుండె నిజముగా పనిచేసే ఒక యంత్రము. నీ శరీరములో ఒక లక్షమైళ్ళ రక్తనాళము లున్నవి. అయినను నీ గుండె వీటన్నిటిగుండా రక్తమును ప్రవహింపజేయుచునే యున్నది. సామాన్య మానవుని గుండె రోజుకి ఒక లక్షసార్లు కొట్టుకొనును. అయినను ప్రతి సెకనులో 16వ భాగము మట్టుకది విశ్రమించును. అనగా సగటున నీ గుండె రోజుకి ఆరుగంటలు లేదా సామాన్య మానవుని జీవితంలో 20 సంవత్సరములు అది విశ్రమించును.

అన్నిటికంటె గొప్పది మానవుని మేధస్సు. అది వర్ణణాతీతమైనది. అది ఆలోచించుటకు, జ్ఞాపక ముంచుకొనుటకు, యోచించుటకు, వివేచించుటకు శక్తిగలది. దానిలో జ్ఞాన వివేకములు, అంతరాత్మ, భావములు మొదలగునవి ఇమిడి యున్నవి. దేవుడు తనకు తానే నివసించగల చోటు అది. దేవుని ఆశ్చర్య చకిత సృష్టి మానవుడు !!

అందుకే దావీదు మహారాజు ఇట్లనుచున్నాడు : "నా అంతరింద్రియములను నీవే కలుగజేసితివి. నాతల్లి గర్భమందు నన్ను నిర్మించినవాడవు నీవే. నీవు నన్ను కలుగజేసిన విధము చూడగా భయమును, ఆశ్చర్యమును నాకు పుట్టుచున్నవి" (కీర్తన 139:13, 14).

\- జేక్ ఎక్హమ్

◆◆◆

# "నీవు క్రైస్తవుడవు కాగోరుచున్న యెడల ..."
## (To become a Christian....)

నీవు మొదట దేవుని వాక్యమును విని, దేవునియందును యేసుక్రీస్తునందును విశ్వాసముంచవలెను :

a) "కాగా వినుట వలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును" (రోమా 10:17).
యోహాను 20:30-31 చదువుము.

b) "విశ్వాసము లేకుండ దేవునికి ఇష్టుడై యుండుట అసాధ్యము; దేవుని

యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకువారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను" (హెబ్రీ 11:6).

c) "నమ్ము ప్రతివానికి ... రక్షణ కలుగజేయుటకు సువార్త దేవుని శక్తియై యున్నది. ఎందుకనిన, నీతిమంతుడు విశ్వాస మూలముగా జీవించునని వ్రాయబడిన ప్రకారము విశ్వాస మూలముగా అంత కంతకు విశ్వాసము కలుగునట్లు దేవుని నీతి దాని యందు బయలుపరచబడుచున్నది" (రోమా 1:16, 17).

d) "మీరు దేవుని యందు విశ్వాస ముంచుచున్నారు, నా యందును విశ్వాసముంచుడి" యని యేసు చెప్పెను (యోహాను 14:1). "నేను ఆయనననని మీరు విశ్వసించని యెడల మీరు మీ పాపములోనే యుండి చనిపోవుదురని" ఆయన చెప్పెను (యోహాను 8:24).

2. నీ పాపముల విషయమై మారుమనస్సు పొందవలెను :

a) "మీరు మారుమనస్సు పొందనియెడల మీరందరును ఆలాగే నశింతురు"(లూకా 13:3, 5).

b) ఆ అజ్ఞాన కాలములను దేవుడు చూచి చూడనట్టుగా ఉండెను ; ఇప్పుడైతే అంతటను అందరును మారుమనస్సు పొందవలెనని మనుష్యులకు ఆజ్ఞాపించుచున్నాడు" (అపొ.కా.17:30).

3. యేసుక్రీస్తు నామమును మనుష్యుల యెదుట ఒప్పుకొనవలెను :

a) "మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందునని" క్రీస్తు చెప్పెను (మత్త 10:32).

b) "యేసు ప్రభువని నీనోటితో ఒప్పుకొని దేవుడు మృతులలో నుండి ఆయనను లేపెనని నీ హృదయమందు విశ్వసించిన యెడల నీవు రక్షింపబడుదువు" (రోమా 10:9).

4. నీవు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందవలెను :

a) "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి" (అపో.కా.2:38).

b) "గనుక నీవు తడవుచేయుట ఎందుకు? లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికో" (అపో.కా.22:16).

c) "దానికి సాదృశ్యమైన బాప్తిస్మము ఇప్పుడు మిమ్మును రక్షించుచున్నది" (1 పేతురు 3:21).

d) "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు." (గలతీ 3:27).

5. నీవు పై విషయములకు లోబడిన యెడల క్రైస్తవుడ వగుదువు. క్రీస్తు సంఘములో చేర్చబడుదువు :

a) "కాబట్టి అతని వాక్యము అంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి; ఆ దినమందు ఇంచుమించు మూడువేలమంది చేర్చబడిరి". "మరియు ప్రభువు రక్షణ పొందుచున్నవారిని అనుదినము వారితో చేర్చుచుండెను" (అపో.కా.2:41, 47).

b) "మన మందరము ఒక్క శరీరములోనికి ఒక్క ఆత్మయందే బాప్తిస్మము పొందితిమి" (1 కొరింథీ 12:13).

6. క్రీస్తు సంఘములో చేర్చబడిన తరువాత నమ్మకమైన క్రైస్తవులతో స్థానిక క్రీస్తు సంఘములో నీవు ఆయన నారాధించి ఆయనకు పనిచేయవలెనని దేవుడు నిన్ను కోరుచున్నాడు. అట్లు చేయుటలో దేవుడు నిన్ను, నీ జీవితమును అంగీకరించును. "యేసు నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రి యొద్దకు రాడు" అని చెప్పెను (యోహాను 14:6).

"క్రీస్తు సంఘములన్నియు మీకు వందనములు చెప్పుచున్నవి" (రోమా 16:16).

◆◆◆

(రాజమండ్రి), జాషువా గూటం గార్లు సుదర్శనరావ్ దంపతుల ఆదర్శకుటుంబమును గూర్చి అభినందించిరి. సోదరులు వి.వి.ప్రసాద్ (కొయ్యలగుడెం) గారి అధ్యక్షతన సమస్తము సక్రమముగా సంతోషముగా జరిగెను. సోదరి కబితా గూటం గారు సుదర్శరావ్ - ఎలీజబెత్‌లతో కేక్ కటింగ్ చేయించిరి. వారి జ్యేష్ఠ కుమారుడు రాజా విజయకుమార్ వందన సమర్పణ చేయగా కూటము ముగిసెను. తదుపరి వచ్చిన బంధు మిత్రులందరికీ మంచి విందు నేర్పాటు చేయబడెను. సుదర్శనరావ్-ఎలీజబెత్‌లకు నలుగురు సంతానము : రాజా విజయకుమార్, జాలీశ్రీలత, జిమ్‌ప్రకాశ్, సుదీప. ఈ సత్ క్రైస్తవ కుటుంబమును గూర్చి బంధు మిత్రులు దేవుని స్తుతించిరి.

జూన్ 20వ తేదీ బుధవారం కృష్ణాజిల్లా కుంటముక్కల గ్రామంలో పలు సంవత్సరముల నుండి క్రీస్తు సువార్త చేయుచున్న సోదరులు కె.జె.సుదర్శనం గారి మూడవ, నాల్గవ కుమార్తెల వివాహ రిసెప్షన్ ఘనముగా జరిగెను. ఆ కార్యక్రమములో సోదరులు జాషువా గూటం గారు పాల్గొని నూతన దంపతులకవుసరమైన హెచ్చరికలను దేవుని గ్రంథము నుండి అందించిరి. అటుతరువాత బాబు పోతన్ (మైలవరం) యన్.కె.వై.దాసు (ఇబ్రహీంపట్నం), కె.ఇశ్రాయేలు (కంభంపాడు) గారు క్లుప్తముగా తగు హెచ్చరికలనిచ్చిరి. సుదర్శనం గారి కుమారుడు వినోద్‌కుమార్ కార్యక్రమము నంతటిని మర్యాదకరముగా నడిపించిరి. హాజరైన బంధు మిత్రులకు చక్కటి విందు ఏర్పాటు చేయబడెను.

జూన్ 23వ తేదీ శనివారం సోదరులు జాన్ సుందర్‌సింగ్ గూటం గారి జ్యేష్ఠ కుమారుడు సామ్యూల్ సుధీర్‌సింగ్ యొక్క వివాహము రాజమండ్రిలో ఘనముగా జరిగెను. ఆ సందర్భముగా వివాహ సందేశమును జాషువా గూటం గారు అందించిరి.

జూన్ 26వ తేదీ మంగళవారం రాజమండ్రి సారంగధర మెట్ట జయానగర్‌లో నిర్మించబడిన క్రీస్తు సంఘు ఆలయమును అమెరికా నుండి వచ్చిన సోదరులు హేరీఏండర్సన్ గారు ప్రార్థన పూర్వకముగా రిబ్బను కత్తిరించి ప్రతిష్ఠించిరి. ఆ సందర్భముగా ఏర్పాటు చేయబడిన సభకు సోదరులు జాషువా గూటం గారు అధ్యక్షత వహించిరి. ఏండర్సన్ గారు స్థానిక సువార్తికులు వి. సుదర్శన్‌రవ్ గారి యథార్థతను, నమ్మకమును, దేవుని కొరకు ఆయన చేయుచున్న పనిని కొనియాడిరి. సోదరులు టి.ప్రేమానందం గారు తొలి ప్రార్థన చేసిరి, టి.వి.యన్.కుమార్‌గారు వాక్యపఠనం గావించిరి. టి.జ్ఞానానందం గారి ప్రార్థనతోను, సుదర్శనరావ్ గారి వందన సమర్పణతోను నాటి ప్రతిష్ఠ కార్యక్రమము ముగిసెను. వచ్చిన వందలాది ప్రజలకు స్థానిక సంఘము, సుదర్శనరావ్ గారి కుటుంబము చక్కటి విందు ఏర్పాటుచేసిరి

2001, జూన్ 29వ తేదీ శుక్రవారం నాడు పాత పెద్దాపురంలో బొమ్మలగుడివద్ద

గల చక్కటి క్రీస్తు సంఘ ఆవరణలో సువార్తికుల సదస్సు ఘనముగా జరిగెను స్థానికులు, పలు ప్రాంతముల సువార్తికులు సంతోషముతోకూడి రాగా, దైవారాధన-కానుకలు అను అంశము చర్చించబడెను. సోదరులు యం.నూర్యరావ్ (ఫక్రుద్దీన్‌పాలెం) గారి ప్రార్ధనతో సదస్సు ఆరంభమాయెను. సోదరులు టి.వి.ఎన్. కుమార్ గారు స్థానిక సువార్తికులు వి. స్వామినాదం గారిని, సంఘాన్ని పరిచయం చేసి ఏర్పరచబడిన అంశముపై చక్కటి వివరణ యిచ్చిరి. అటుతరువాత జాన్ రిక్కీ గూటం (కాకినాడ), జి.యోనా (వెంకటకష్ణరాయపురం), బూల యోహాను (పల్లంకుర్రు), వి.యేసు (పిఠాపురం), యస్. శ్యామ్‌ప్రసాద్ (వేళంగి), జాషువా గూటం గార్లు సదస్సులో వాక్యోపదేశం గావించిరి. ఆర్.సామ్యూల్ (అమలాపురం), యం.యేసుదాసు (మాధాపురం) గార్లు ప్రార్థన చేయుటలో సహకరించిరి. స్థానిక సువార్తికులు వి.స్వామినాదం గారు వందన సమర్పణ చేయగా, యం.కిరణ్‌కుమార్ (రాజమండ్రి), గారి ప్రార్ధనతో సదస్సు ముగిసెను. స్థానిక సంఘము వచ్చిన వారందరికీ మంచి భోజనము నేర్పాటుచేసిరి. సోదరులు టి.వి.ఎన్.కుమార్ గారి సహాయ సహకారములతో వి.స్వామినాదం గారు పాతపెద్దాపురం లోను, తదితర ప్రాంతములలోను క్రీస్తుకొరకు మంచిపని చేయుచున్నారు..


RNI Regd. No. 69973/98

Postal Regd. No. VM/KD/05/2001


From:

**SATYA VAKKU**
**P.O. BOX 80,**
**KAKINADA - 533 001**

To


Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani-Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. KAKINADA - 533 004. Editor : Joshua Gootam